
సాక్షి
ప్రకాశం
గురువారం । 31 । అక్టోబర్ । 2024



.ముసి వాగులో జారిపడి ఇద్దరు దుర్మరణం

పశువుల మేపుతున్న క్రమంలో ముసివాగులో జారిపడి ఇద్దరు మృతిచెందిన ఘటన కారుమంచిలో బుధవారం జరిగింది. - 8లో..



భూ దందా మళ్లీ మొదలైంది

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



ఒంగోలు సిటీ: దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రకాశం జిల్లా ప్రజలకు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అంటేనే చీకటిపై వెలుగు.. చెడుపై మంచి.. అజ్ఞానం పై జ్ఞానం.. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ అని అన్నారు. దీపావళి సందర్భంగా ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని ఆకాంక్షించారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

ఒంగోలు అర్బన్: ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ రోజు ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా ప్రజలు పిల్లలతో దగ్గర ఉండి క్రాకర్స్ కాల్చాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: కాంపెన్సేషన్ అఫారెస్టేషన్ (సీఏ) అంశంలో రెవెన్యూ, అటవీ, సర్వే శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులతో ప్రకాశంభవనంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రజా ప్రయోజనాల కోసం అటవీ భూములు తీసుకునే సందర్భంలో నష్టపరిహారంగా అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు, ఆయా భూముల్లో అడవుల పెంపుపై చర్చించారు. జిల్లాలోని పరిస్థితులు సీఏ కోసం ప్రతిపాదనలు, వాటి సరిహద్దులు తదితర అంశాలపై ఆరా తీశారు. భూములు ఆక్రమణకు గురికాకుండా నిషేధిత భూముల జాబితాలో చేర్చడంపై అధికారులతో చర్చించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషా, అటవీ శాఖ అధికారులు పీసీపల్లి, కనిగిరి, సీఎస్ పురం, వెలిగండ్ల, పుల్లలచెరువు, పెద్దారవీడు, రాచర్ల, దోర్నాల, కొమరోలు, తర్లుపాడు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

స్కిల్ సెన్సెస్ సర్వేపై శిక్షణ

ఒంగోలు అర్బన్: నైపుణ్య గణన సర్వే (స్కిల్ సెన్సెస్ సర్వే) యాప్, వెబ్‌సైట్‌కు సంబంధించి సర్వే ఎలా నిర్వహించాలో తెలుపుతూ గ్రీవెన్స్ హాలులో శిక్షణ నిర్వహించారు. జిల్లాలో ప్రతి మండలం నుంచి ఇద్దరు ఎస్‌డబ్ల్యూఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా ఆయా మండలాల్లో ఉన్న సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, డీఎల్‌డీవో ఉషారాణి, పశుసంవర్ధక శాఖ డీడీ రవికుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఏబీఎం విద్యార్థి ఎంపిక



క్రీడాకారుడ్ని అభినందిస్తున్న ఏబీఎం జూనియర్ కాలేజీ కరస్పాండెంట్

ఒంగోలు: జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఒంగోలు ఏబీఎం జూనియర్ కాలేజీ విద్యార్థి కె.దినేష్ ఎంపికయ్యారు. ఇతను ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నారు. ఈనెల 26, 27 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన దినేష్ నవంబరు 19 నుంచి 21 వరకు కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కాలేజీ కరస్పాండెంట్ గారపాటి పుష్పరాజు, ప్రిన్సిపాల్ దేవరకొండ శ్రీవాణి, ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా కార్యదర్శి పి.చింపారెడ్డి తదితరులు అభినందించారు.



● రంగుల రవళి..

కనుల ముందు కాంతి రేఖలు
జీవితాల్లో ఆనంద మధురిమలు
తారాజువ్వల్లాంటి సంతోషాలు
మతాబుల్లాంటి జ్ఞాపకాలు
దీపావళి..
చెడును అంతం చేసిన బాణం
నిశీధిలో ఉన్న ప్రజలకు
వెలుగు పంచిన కాలం
నరకాసుర వధ తర్వాత లోకకల్యాణం
ప్రతి ఏటా అది ఓ విజయ చిహ్నం
'సాక్షి' పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు

సాక్షి, ఒంగోలు

ఆక్రమిత అటవీ భూముల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న రజనీ కుమారి

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 8లోని ఆక్రమిత అటవీ భూములను తహసీల్దార్ రజనీకుమారి బుధవారం పరిశీలించారు. 'వందల ఎకరాలు మింగేశారు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఆ సర్వేనంబర్‌లో వందల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని నిర్ధారించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఆంజనేయులు, సర్వేయర్ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టం అందరిదీ..

ఫలితం మీదా..



కూటమి పార్టీల మధ్య సమన్వయం కుదరలేదు. సమావేశంలో నేతల మధ్య మాటల యుద్ధంతో రసాభాసగా మారింది. కూటమి నేతల మధ్య విభేదాలు మరింతగా పెరిగాయి. ఎన్నికల్లో విజయానికి అందరం కృషి చేశామని, అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదంటూ జనసేన, బీజేపీ నేతలు మండిపడ్డారు. కనీసం సమన్వయ సమావేశం సమాచారాన్ని కూడా అందరికీ చెప్పలేదంటూ నిలదీశారు. జిల్లాలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతల తీరు సరిగ్గా లేదంటూ మంత్రుల సమక్షంలో నిరసన వ్యక్తం చేశారు. సమన్వయ చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి.

- సమన్వయ సమావేశంలో కూటమి నేతల మధ్య మాటల యుద్ధం
- జనసేన నేత అరుణ, బీజేపీ నేత ఆవేదన
- తమకు ప్రాధాన్యత లేదంటూ జనసేన, బీజేపీ నేతల నిరసన
- మంత్రుల సమక్షంలో జిల్లా నేతలను నిలదీసిన వైనం
- బట్టబయలైన విభేదాలు
- సమావేశ సమాచారం అందరికీ చెప్పలేదని నిరసన
- జనసేన నేతలు రియాజ్, అరుణ మధ్య వివాదం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి సమన్వయ సమావేశంలో పార్టీల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంగా బుధవారం భాగ్యనగర్ మూడోలైన్‌లోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి సంబంధించి పూర్తిస్థాయి సమాచారం లేకపోవడంతో బీజేపీ, జనసేన నాయకులు కొద్ది మంది మాత్రమే హాజరయ్యారు. జనసేన తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ తరఫున కొద్ది మంది మాత్రమే వచ్చారు. జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తమను పట్టించుకోవడం లేదంటూ ఈ సమావేశంలో కూటమి భాగస్వామి పక్షాలుగా ఉన్న జనసేన, బీజేపీ నేతలు నిరసన గళాన్ని వినిపించారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటి తరువాత జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మాట్లాడారు. ''ఎన్నికల్లో కూటమి విజయం కోసం నాయకులందరూ కలిసి పనిచేశామని, కానీ ఇప్పుడు జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, జనసేన నాయకుల మధ్య దూరం పెరుగుతోందని, ఈ విషయాన్ని గమనించాలి'' అని ఆమె అన్నారు. అధికారిక కార్యక్రమాల్లో జనసేన నాయకులను కూడా కలుపుకొని పోవాలని సూచించారు. బీజేపీ నేత యోగయ్య యాదవ్ అరుణకు మద్దతుగా నిలిచారు. అరుణ చెప్పింది వాస్తవమే అని స్పష్టం చేసినట్లు సమాచారం.

కూటమి విజయం కోసం అందరూ పనిచేశామని, దాని ఫలితాలు కొందరు మాత్రమే అనుభవించడం సరైంది కాదని ఆయన నిలదీసినట్టు తెలిసింది. తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైనవారు కూడా కూటమి సమావేశానికి హాజరయ్యారని, అలాగే మాకు కూడా సమాచారం ఇచ్చి ఉంటే అన్నీ నియోజకవర్గాల నుంచి బీజేపీ నాయకులు కూడా హాజరయ్యేవారని అన్నట్లు తెలిసింది. అయితే తాము జిల్లా అధ్యక్షులకు సమాచారం ఇచ్చామని నూకసాని బాలాజీ అంటూ దాటేసే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో జనసేన నేతలు రియాజ్, అరుణల మధ్య మాటల యుద్ధం జరిగినట్టు తెలిసింది. అసలు నిన్ను సమావేశానికి ఎవరు రమ్మన్నారని అరుణపై రియాజ్ మండిపడ్డారు. నువ్వేం మాట్లాడుతున్నావు, ఈ సమావేశానికి నువ్వు ఎందుకు వచ్చావు. ప్రొటోకాల్‌లో నీ పేరుందా అంటూ ప్రశ్నించారు. దీంతో కొంత సేపు ఇద్దరి మధ్య రచ్చ జరిగిందని సమాచారం. సమావేశానికి హాజరైన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో సహా అక్కడకు వచ్చిన తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలంతా బిత్తరపోయారు. ఎవ్వరూ ఎలాంటి జవాబు ఇవ్వకుండా ఊరుకుండిపోయారు. ఈ దశలో బీజేపీ నేత యోగయ్య యాదవ్ అరుణకు మద్దతుగా నిలిచారని, ఆమె మాట్లాడిన దాంట్లో తప్పేముందని అన్నట్టు తెలిసింది. దీనికి స్పందించిన రియాజ్ ఇది నీ పార్టీ వ్యవహారం కాదని, నీ సంగతి నువ్వు చూసుకోవాలని పరుషంగా మాట్లాడడంతో వారి మధ్య కూడా మాటమాట పెరిగి వివాదం జరిగిందని తెలిసింది.

మాకు ఎలాంటి సంబంధం లేదు...

టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ కల్పించుకొని ఈ గొడవతో మాకెలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. మేము కూటమిలోని పార్టీలకు చెందిన జిల్లా అధ్యక్షులకు సమాచారం ఇచ్చామని తెలిపా రు. మిగిలిన పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చారో లేదో మాకు తెలియదని స్పష్టం చేశారు. నిజానికి జనసేన నాయకుల మధ్య విభేదాలు ఉన్న సంగతి టీడీపీ నాయకులందరికీ తెలిసిందే. ఆ పార్టీ జిల్లాలో రెండు గ్రూపులుగా కొనసాగుతోంది. ఈ రెండూ గ్రూపులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత టీడీపీపైనే ఉందని జనసైనికులు చెప్పుకుంటున్నారు. రెండూ గ్రూపుల నాయకులకు సమాచారం ఇచ్చి ఉంటే ఇలాంటి రచ్చ జరిగేందుకు అవకాశం ఉండేది కాదని, కావాలనే వారిద్దరి మధ్య చిచ్చు పెట్టి తమాషా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది సేపటికి మంత్రులు సమావేశాన్ని ముగించుకుని వెళ్లిపోయారు.

జర్నలిస్టులకు అవమానం

ఒంగోలు టౌన్: సమన్వయ కమిటీ సమావేశంలో జర్నలిస్టులకు అవమానం జరిగింది. జర్నలిస్టులు కూర్చున్న కుర్చీలను సైతం నాయకులు లాక్కోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఒక ఎలక్ట్రానిక్ ఛానెల్ ప్రతినిధి కూర్చున్న కుర్చీని లాక్కున్నారు. మరో ప్రజా ప్రతినిధి కూడా ఇలాగే మీడియా జర్నలిస్టు కుర్చీ లాగేసుకుని కూర్చున్నారు. అయినా వారికి కూర్చునేందుకు ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడం గమనార్హం. సమావేశం పూర్తయ్యేంత వరకు జర్నలిస్టులు నిలుచునే ఉన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లు పక్కాగా పంపిణీ చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:

జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా పంపిణీ చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా గ్యాస్ పంపిణీదారులకు సూచించారు. ప్రకాశం భవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దీపం-2 పథకం కింద అర్హులైన పేదలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందించేందుకు ఈనెల 31 నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో మొత్తం 49 ఏజెన్సీలు ఉన్నాయన్నారు. పథకం కింద ఎల్పీజీ, ఆదార్, బియ్యం కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతా ఉన్నవారికి ఉచితంగా మూడు సిలిండర్‌లు ఇచ్చేందుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ముందుగా గ్యాస్ సిలిండర్‌కు ధరను చెల్లించాలని రెండు రోజుల్లో తిరిగి లబ్ధిదారుని ఖాతాకు ఆ నగదు జమవుతుందన్నారు. సమస్యలు, సందేహాలకు టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ పద్మశ్రీ, ఐఓసీఎల్ నోడల్ అధికారి భాస్కర్ రావు, ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా భారం రైతుల పైనే..

అకాల వర్షాలు, కరువు ఇలా..ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉన్న పంటల బీమా పథకాన్ని గత ప్రభుత్వం రైతులపై భారం పడకుండా ఉచితంగా కల్పించింది. గత ఐదేళ్ల పంట నష్టపోయినా ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసాతో రైతులు నిశ్చింతగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడింది. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని తేల్చిచెప్పడంతో తమకు వ్యయప్రయాసలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని చెబుతున్న ఏఓ మెర్సీ



వర్షాలకు మొలకలు వచ్చిన సజ్జ పంటను చూపుతున్న రైతులు

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రైతుల నడ్డి విరిచేందుకు సిద్ధమైంది. ఖరీఫ్ సీజన్ ముగిసినా అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేకుండా పోయింది. అన్నదాతలపై గత ప్రభుత్వం పైసా భారం పడకుండా ఐదేళ్ల విజయవంతంగా అమలు చేసిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి కూడా ఈ ప్రభుత్వం మంగళం పాడింది. కూటమి ప్రభుత్వ పాలనలో తమకు అప్పులు తప్ప ఆదాయం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2024 ఖరీఫ్ సాగు లక్ష్యం 2,02,249 హెక్టార్లు కాగా అక్టోబర్ మొదటి వారానికి 1,60,017 హెక్టార్లలో మాత్రమే సాగుచేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సజ్జ, మినుము, అలసంద, పత్తి, వరి, పొగాకు రైతులతో పాటు ఉద్యానవన పంటలైన మిర్చి, పండ్ల తోటలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. సజ్జ 1900, మినుము 1400, అలసంద 1700, పత్తి 3,300, పొగాకు 915 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. మిగిలిన పంటలన్నీ కలిపి మొత్తం మీద జిల్లాలో 9,252 హెక్టార్లలో పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి. సుమారు 8,500 మంది రైతులకు రూ.400 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. పంటల బీమా ఉంటేనే నష్టపోయిన పంటలకు పరిహారం దక్కుతుంది.

- రైతులపై కూటమి ప్రభుత్వం మరో పిడుగు
- ఉచిత పంటల బీమా పథకానికి మంగళం
- డిసెంబర్ 15 లోపు రైతులే ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులు
- గత ఐదేళ్లు బీమా కోసం ఒక్క రూపాయి కూడా చెల్లించని రైతులు

గతంలో ప్రభుత్వమే చెల్లించింది..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఖరీఫ్ నుంచి రైతుపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ-క్రాప్ నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీని వల్ల బీమా గురించి రైతులకు ఇబ్బందులు లేకుండా పోయాయి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులతోపాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా రైతులకు ఎలాంటి సాయం అందించకపోగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసింది.

డిసెంబర్ 15 లోపు ప్రీమియం చెల్లించాలి..

పంటల బీమా కోసం డిసెంబర్ 15వ తేదీలోపు బ్యాంకులు, సీఎస్‌సీ, మీ సేవా కేంద్రాలు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో రైతులు ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అప్‌డేట్ చేసిన ఆధార్‌కార్డులు, 1బీ, అడంగల్, బ్యాంక్ పాస్ పుస్తకం, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీ పత్రాలు, ఫోన్ నంబర్ తదితర వివరాలు సమర్పించి ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. పంటలు సాగు చేసినట్లు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి చేశారు. ఎకరాకు శనగ పంటకు రూ.368, మినుములు రూ.103, మొక్కజొన్న రూ.105, వరి రూ.215, ఎండు మిరప రూ.525, జొన్న రూ.60 బీమా ప్రీమియం చెల్లించాలి.

రైతు వ్యతిరేక ప్రభుత్వం



టీడీపీ ప్రభుత్వం రైతు వ్యతిరేకంగా మారింది. హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ప్రతి ఏటా రైతులకు ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఊదరగొట్టడం తప్ప అమలు చేయలేదు. ఉచిత పంటల బీమా పథకాన్ని తొలగించి రైతులపై భారం మోపడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది. చంద్రబాబు మరోసారి రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు.

– ధాకాల పుల్లయ్య, నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి

ఉచిత పంటల బీమా అమలు చేయాలి



ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేస్తే బాగుంటుంది. గతంలో ఐదేళ్లుగా ఒక్క రూపాయి చెల్లించలేదు. ఉచితంగానే పంటలకు బీమా చేశారు. నేడు రైతులే బీమా నగదు ఆన్‌లైన్‌లో చెల్లించుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇది ఎంతో వ్యయప్రయాసలతో కూడుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

– జీ బాలగురవయ్య, జేసీ అగ్రహారం

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు చందలూరు విద్యార్థి



మూడో స్థానంలో నిలిచిన జట్టు



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన వై దయాసాగర్

దర్శి: రేపల్లెలో ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచిన చందలూరు విద్యార్థి వై దయాసాగర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రేపల్లెలో నిర్వహించిన పోటీల్లో 26 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా ప్రకాశం జిల్లా మూడో స్థానంలో నిలిచింది. జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టులో దయాసాగర్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గంధం గురుప్రసాద్, పాఠశాల పీడీ సోము అంజిరెడ్డి విద్యార్థిని అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ముగిసిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు



షాట్‌పుట్ విసురుతున్న ఉద్యోగులు



ఖోఖోలో సత్తాచాటుతున్న ఉద్యోగులు

ఒంగోలు: సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక స్థానిక మినీ స్టేడియంలో బుధవారం ఉత్సాహంగా ముగిసింది. జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి గుంటి రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక కార్యక్రమాన్ని క్రీడాభివృద్ధి శాఖ కోచ్‌లు ఎస్.శ్రీనివాసరావు, పి.వేణు, బి.శ్రీనివాసులుతోపాటు పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పర్యవేక్షించారు. వాలీబాల్, లాన్ టెన్నిస్, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపికైన వారు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని ప్రతిభా పాటవాలు ప్రదర్శించనున్నారు.

వాలీబాల్: ఎస్.అరుణ, ఎం.మధులత, ఎం.సృజన, ఎ.శిరీషకుమారి

లాన్‌టెన్నిస్: డాక్టర్ వెంకట రమణ, రమేష్, అశోక్‌రెడ్డి

ఖోఖో: సోమశేఖరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, అనీల్, సావిత్రమ్మ

అథ్లెటిక్స్: ఎ.ఉషారాణి, బి.ఉషారాణి

వీఎస్‌టీ జిల్లా కో ఆర్డినేటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు టౌన్: డాక్టర్ ఎన్టీఆర్ వీఎస్‌టీ జిల్లా కో ఆర్డినేటర్‌గా పనిచేసేందుకు ఆసక్త కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ అర్హత కలిగిన సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఐదేళ్ల పాటు రెగ్యులర్ సర్వీస్ పూర్తి చేసిన, ప్రొబేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థిపై ఎలాంటి చార్జెస్ పెండింగులో ఉండరాదని, 45 సంవత్సరాల కంటే వయసు తక్కువగా ఉండాలని చెప్పారు. ఎంపికైన అభ్యర్థి జిల్లా కో ఆర్డినేటర్ గా జిల్లా ఫారిన్ సర్వీసెస్‌గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను నవంబర్ 7వ తేదీలోపు డీఎంహెచ్‌ఓ కార్యాయంలో అందజేయాలని తెలిపారు.






మార్కెట్‌లో వివిధ రకాల ఆకృతుల్లో లభిస్తున్న ప్రమిదలు

పండుగ శోభ..

వెలుగుల పండుగ దీపావళికి సర్వం సిద్ధమైంది. చీకట్లు తరిమి వెలుగులు నింపే ప్రమిదలు, బాణసంచా కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వివిధ ఆకృతుల్లో ప్రమిదలు మార్కెట్‌లో దర్శనమిచ్చాయి. – సాక్షి, ఒంగోలు



బాణసంచా కొనుగోలుదారులతో..





ప్రమిదలు, పూల కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి

భూ దందా మళ్లీ మొదలైంది..!



సర్వేనంబరు 8లో ఆక్రమిత భూమిలో బోరు వేసి పంటసాగు

- టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రంగంలోకి అక్రమార్కులు
- వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణ, క్రయవిక్రయాలు
- పుష్కలంగా రెవెన్యూ అధికారుల అండదండలు



ఆక్రమిత భూమిలో ఏర్పాటుచేసిన సోలార్‌ప్యానల్

కురిచేడు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమో గానీ..అక్రమార్కులకు మాత్రం పండగే. 2014–2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని లక్షలు గడించిన అక్రమార్కులు..ఇప్పుడు మళ్లీ రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వ భూములను గద్దల్లా తన్నుకుపోతున్నారు.

గద్దల్లా తన్నుకుపోవడమే..

2014–19 మధ్యకాలంలో మండలంలోని కల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 272, పెద్దవరం గ్రామ సర్వేనంబర్ 306లతో పాటు కురిచేడులోని రెవెన్యూ ఫారెస్టు వివాదాస్పద భూమి సర్వే నంబర్ 8లో ఎక్కువగా ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. వాటిని తిరిగి అమ్మకాలు కూడా చేస్తూ యథేచ్ఛగా సొమ్ము చేసుకున్నారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019–24లో భూ ఆక్రమణలు ఆగిపోయాయి. రీ సర్వే చేస్తే ప్రభుత్వ భూములు బయటపడతాయన్న భయంతో ఆ భూములు కొనుగోలు చేసేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. కానీ తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆక్రమణదారులు జులుం విధిస్తున్నారు. దీంతో తిరిగి ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. కల్లూరు సర్వేనంబరు 272 లో 432.98 ఎకరాల భూమి ఉంది. దానిలో 137 ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. మిగతా భూమి కూడా ఎవరికి వారు ఆక్రమణలు చేసుకుంటూ గొడవలు పడి కోర్టు కేసులు కూడా నడుస్తున్నాయి. అలాగే పెద్దవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 306 లో 630 ఎకరాలు భూమి వుంది. దాన్ని ఆక్రమిస్తుండటంతో అధికారులు ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకొని బోర్డులు పెట్టినా తిరిగి ఆక్రమణలు చేయటం పరిపాటైంది. మండలంలోని పడమరవీరాయపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 8లో 575 ఎకరాల భూమి ఉంది. దానితో పాటు అటవీప్రాంతంలో ముప్పిగంగవరం, పడమరనాయుడుపాలెం, ఆవులమంద జగన్నాథపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఆక్రమించిన భూములలో బోర్లువేసి విద్యుత్ మోటార్లు, సోలార్‌ప్యానల్లు బిగించి సాగుచేసుకుంటున్నారు. ఆక్రమించిన భూములకు విద్యుత్ శాఖ ఏ విధంగా కనెక్షన్ ఇస్తుందో అర్థం కాని పరిస్థితి. రెవెన్యూ అధికారులు కూడా ఆక్రమణలను పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుంటే లక్షల విలువైన ప్రభుత్వ భూములు పరులపాలయ్యే అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం టౌన్: పాఠశాలకు వెళుతున్నానని చెప్పిన తన కుమారుడు కనిపించడం లేదని తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన మరియమ్మ కుమారుడు ఇల్లూరి రూపస్(16) మండలంలోని వెలుగొండ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చి ఈ నెల 25న తిరిగి గురుకుల పాఠశాలకు వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. కానీ పాఠశాలకు వెళ్లలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో ద్వారా మెరుగైన సేవలందించాలని, నిర్దేశిత సమయంలో వారి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో బుధవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మన జిల్లా పారిశ్రామిక రంగంలో మొదటిస్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. సింగిల్ విండో ద్వారా జిల్లాలో 2023 నవంబర్ నుంచి ఇప్పటివరకు పరిశ్రమ ఏర్పాటుకు 2939 దరఖాస్తులు అందగా వాటిలో 2924 దరఖాస్తులు ఆమోదించామన్నారు. నిబంధనల మేరకు లేని ఒక్క దరఖాస్తును తిరస్కరించామన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 దరఖాస్తుల్లో ఏపీపీసీబీ ఈఈ వద్ద 10, ఏపీఐఐసీ వద్ద ఒక దరఖాస్తు, ఫ్యాక్టరీ శాఖలో 1, గ్రౌండ్ వాటర్‌కు సంబంధించి మరొకటి, లీగల్ మెట్రాలజీ వద్ద ఒకటి ఉన్నాయని వివరించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి 399 దరఖాస్తులు రాగా వాటిలో 384 దరఖాస్తులు రూ.6.95 కోట్ల ప్రోత్సాహకాలకు సిఫార్సు చేసామన్నారు. పీఎం విశ్వకర్మ యోజన కార్యక్రమం కింద జిల్లాలో 59.277 దరఖాస్తులు రాగా స్టేజ్ 1లో 54038 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. స్టేజ్ 2లో 42,737 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా తయారీ కేంద్రాల వద్ద ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా లేదా నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఉప రవాణా కమిషనర్ సుశీల, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాఘవరెడ్డి, ఎల్‌డీఎం రమేష్, ఏపీఐఐసీ జెడ్‌ఎం మదన్‌మోహన్, ఏపీఎస్‌ఎఫ్‌సీ బ్రాంచ్‌మేనేజర్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ వెంకటేశ్వర్లు, గ్రౌండ్‌వాటర్ డీడీ విద్యాసాగర్, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మూసీ వాగులో జారిపడి ఇద్దరు దుర్మరణం



గడియం ఆదిలక్ష్మి(ఫైల్)



మల్లవరపు సుబ్బారెడ్డి మృతదేహం



మూసీ వాగులో గాలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

టంగుటూరు: పశువులు మేపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మూసీ వాగులో జారి పడి ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని కారుమంచిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కారుమంచి గ్రామానికి చెందిన గడియం ఆదిలక్ష్మి(35), మల్లవరపు సుబ్బారెడ్డి(57) ఇద్దరూ గేదేలు మేపడానికి మూసీ వాగు వైపు వెళ్లారు. అక్కడ పశువులను మేపే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారు. అటుగా వెళుతున్న వ్యక్తి గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆదిలక్ష్మి మృతదేహాన్ని బయటకు తీయగా..సుబ్బారెడ్డి మృతదేహం లభ్యం కాలేదు. దీంతో తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై నాగమల్లీశ్వరరావు ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సాయంతో గాలించి సుబ్బారెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతులిద్దరూ ఒకే గ్రామం కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతులు ఇద్దరూ పేదలే..

మూసీ నదిలో జారిపడి మృతిచెందిన ఇద్దరూ పేదలే. గడియం ఆదిలక్ష్మి భర్త గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వీరికి ముగ్గురు చిన్న పిల్లలు కాగా పాఠశాలకు వెళుతున్నారు. సుబ్బారెడ్డికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

భార్యను కాపురానికి పంపలేదని..

- అత్తామామలపై అల్లుడి దాడి
- అత్త పరిస్థితి విషమం



అల్లుడి దాడిలో తీవ్రంగా గాయపడిన భూమని నాగన్న

పెద్దదోర్నాల: భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో అత్తామామలపై అల్లుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చింతల గిరిజన గూడెంలో మంగళవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో చింతలగూడేనికి చెందిన భార్యాభర్తలు భూమని నాగన్న, వెంకటమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. గూడేనికి చెందిన భూమని నాగన్న, వెంకటమ్మ కుమార్తెను కుడుముల హనుమయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అయితే కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య కొద్దిపాటి మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హనుమయ్య భార్య తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. మంగళవారం జరిగిన చిన్నపాటి వాగ్వాదం తారాస్థాయికి చేరిన నేపథ్యంలో తన భార్యను తనతో పంపమని హనుమయ్య తన అత్తా మామలపై కత్తితో దాడికి దిగడంతో భూమని నాగన్న, వెంకటమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వెంకటమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అనుమానాస్పద మృతి



కల్పన మృతదేహం

కురిచేడు: మండలంలోని పేరంబొట్లపాలెం గ్రామంలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ తెలిపారు. ఎస్సై శివ తెలిపిన వివరాల మేరకు.. యన్నం కల్పన (25) మంగళవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ముందురోజు పుట్టింటి నుంచి వచ్చిన కల్పన మరునాడు మృతి చెందటంతో ఆమె తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాలు కూడా లేవని, ఎందుకు ఆత్మహత్య చేసుకుందో పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని త్రిపురాంతకం సీఐ జి.అస్సాన్ పరిశీలించారు. అనంతరం మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం దర్శిప్రభుత్వ వైద్యశాలకు పంపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

కంభం: మండలంలోని ఎల్‌కోట పంచాయతీలోని సూరేపల్లి ఎస్సీ కాలనీలో రెండు నెలలుగా నీళ్ల రావడం లేదని ఆగ్రహించిన మహిళలు కంభం–మార్కాపురం రోడ్డుపై ఖాళీ బిందెలతో బుధవారం నిరసనకు దిగారు. గత రెండు నెలలుగా బోరు మరమ్మతులకు గురికావడంతో నీటి సమస్య తలెత్తిందని, అధికారులకు ఎన్ని పర్యాయాలు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. నీళ్ల కోసం నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డును దాటుకొని సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు వెళ్లి బోరు నీళ్లు పట్టుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వృద్ధులు, మహిళలు రోడ్డు దాటి నీళ్లు తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫార్మసీ కాలేజీలో కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న స్నేక్ కేచర్ నిరంజన్

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న ఒక ఫార్మసీ కళాశాలలో బుధవారం ఉదయం కొండచిలువ కలకలం సృష్టించింది. సుమారు 8 అడుగుల పొడవున్న ఈ కొండచిలువను చూసి విద్యార్థులు, కళాశాల సిబ్బంది ఆందోళనకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ నిరంజన్కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి వచ్చి కొండచిలువను చాకచక్యంగా పట్టుకొని గోన సంచిలో వేసుకొని అటవీ ప్రాంతంలో వదిలాడు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజుల క్రితం సుమారు పది అడుగుల పొడవున్న కొండచిలువ మార్కెట్ యార్డులో సంచరించడంతో అప్పుడు కూడా పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలారు.

మద్యం మత్తులో విద్యార్థుల ఘర్షణ



ఘర్షణ పడుతున్న విద్యార్థులు

మార్కాపురం రూరల్: మద్యం మత్తులో విద్యార్థులు ఘర్షణకు దిగారు. ఈ ఘటన మండలంలోని దరిమడుగు వద్ద బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మూడు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. పిడిగుద్దులతో ఒకరినొకరు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒక ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన చైర్మన్ విద్యార్థులను సర్దిచెబుతున్నా వారు వినిపించుకోలేదు. పరిస్థితి అదుపు తప్పుతుందని గమనించిన కళాశాల చైర్మన్ రూరల్ ఎస్సై అంకమరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన హుటాహుటిన సిబ్బందితో కళాశాల వద్దకు రావడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఎక్కడి వారు అక్కడ నుంచి పరుగులు తీశారు.

అశోక్ మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

దర్శి: సరదాగా ఈత కొడుతూ సాగర్‌కాలువలో మునిగి మృతి చెందిన అశోక్ మృతదేహాన్ని బుధవారం వెలికితీసినట్లు ఎస్సై మురళి తెలిపారు. దొనకొండ మండలం గట్టుమీదపల్లి గ్రామానికి చెందిన తలమంచి అశోక్ అదే గ్రామానికి చెందిన శివకృష్ణ, వెంకటకృష్ణలతో కలిసి మంగళవారం దర్శికి వచ్చారు. దర్శిలో వెంకటేశ్వర్లు అనే స్నేహితుడితో కలిసి సాగర్ కాలువ వద్ద మద్యం తాగేందుకు వెళ్లారు. అనంతరం అశోక్ ఈతకొట్టేందుకు కాలువలోకి దిగక కాసేపు ఈతకొట్టి ఊపిరి అడక మునిగిపోయాడు. బుధవారం మృతదేహాన్ని వెలికి తీశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బత్తిన కృష్ణ మృతదేహం

మద్దిపాడు: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొష్టాల సెంటర్‌లోని జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన బత్తిన కృష్ణ (65) మద్దిపాడు నుంచి పెదకొత్తపల్లి వెళ్లేందుకు కొష్టాల సెంటర్‌లో కుడివైపు వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో స్కూటీపై వెళుతున్న కృష్ణ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించారు. మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం చోరీకి యత్నం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని క్రిష్టా థియేటర్ సమీపంలో ఉన్న ఏటీఎంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించాడు. ఏటీఎం మిషన్‌ను పగులగొట్టేందుకు ప్రయత్నించగా..శబ్దానికి స్థానికులు మేల్కొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నిందితున్ని అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు.